(కౌముది పాఠకుల కోసం మల్లాదిగారి ప్రత్యేక కానుక)

1

<u>నరకానికి వెళ్ళకూడదనుకుంటే....</u>

బ్రేక్‌ఫాస్ట్‌కి పూర్ణచంద్రుడిలాంటి ఇడ్లీ, సాదా దోశ, మసాలా దోశ, ఉల్లి దోశ, పూరీ, ఊతప్పం పాపులర్. మరో ముఖ్యమైన టిఫిన్ ఉప్మాని మర్చిపోతుంటాం. బద్ధకంగా ఉన్నా, ఏ అర్ధరాత్రో ఊర్నించి ఇంటికి వచ్చినా అన్నం, పప్పు, కూరలు వండే బదులు ఇంత ఉప్మా ఉడకేస్తే పది నిమిషాల్లో రెడీ. దింపే ముందు నెయ్యివేసి దింపేవారికి స్వర్గంలో ప్రత్యేక ప్రవేశం ఉంటుందని మహాపురాణంలో చెప్పారట. ఉప్మాని బట్టి ఆ ఇంటి ఇల్లాలిని అంచనా వేయచ్చు. అది సరిగ్గా ఉడక్క ఉండలు కడితే ఆ ఇంటావిడకి వంట రాదని నమ్మచ్చు. లేదా మనమంటే ఇష్టంలేదని కూడా నమ్మచ్చు. కేవలం రవ్వ ఉడకేసి కేవలం తిరగమోత వేసేవాళ్ళకి నరకంలో ప్రత్యేక చోటుంటుందని నా నమ్మకం. కొందరు ఉప్మాని చవకైందిగా కొట్టిపారేస్తూ, దాన్ని రెఫ్యూజీ కేంప్ షెల్టర్స్ ఆహారంతో సమానంగా చూస్తారు. సరైన ఉప్మా ఖరీదైందే. నేతి తిరగమోతలో కర్వేపాకు, పచ్చిమిర్చి, అల్లం, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, టమాటోలు, కేరట్, పచ్చి బఠాణీలు, మొక్కజొన్న గింజలు వేసి చేసిందే అసలైన ఉప్మా. దీనికి హోటల్ వాళ్ళు 'వెజిటబుల్ ఉప్మా' అని పేరు మార్చి మోసం చేస్తున్నారు. ఇందులో జీడిపప్పు కన్నా వేరుశెనగపప్పు రుచిగా ఉంటుంది. ఉప్మాతో నంచుకోడానికి కొబ్బరి, అల్లం, టమాటో చట్నీలు శ్రేష్టం. రాయలసీమలో మినుముల పచ్చడి ఇస్తారు. కారప్పొడి, నల్లకారం మర్చిపోకూడదండోయ్. ఉప్మాతో వీటిలో కనీసం ఒక్కటైనా ఇవ్వనివాడు కర్టెసీ తెలీనివాడు.

ఉప్మాలో చక్కెర చల్లుకుని తినేవాడి వయసు ఎంతైనా వాడు ఖచ్చితంగా బాలుడే. ఉప్మాలో పెరుగు కలుపుకుని తినేవాళ్ళూ లేకపోలేదు. మా తాతపోయాక మా నాయనమ్మ ఏడుస్తూంటే, ఆవకాయ కలిపిన ఉప్మా ఇస్తే భేషుగ్గా తిని ఆ తర్వాత ఏడుపుని కొనసాగించింది. అప్పుడు ఎందుకు ఏడవలేదని అడిగితే, 'ఉప్మా తింటూంటే ఏడుపెలా వస్తుందర్రా?' అని జవాబు చెప్పింది. అన్నట్లు ఉప్మా నిమ్మరసంతో భలే మజా! టొమాటో బాత్‌ని కనిపెట్టింది కన్నడవాళ్ళు. కర్నాటకలో ఉప్మా, కేసరీ బాత్‌లు సెట్‌గా ఇస్తారు.

పెళ్ళిళ్ళల్లో, చావు ఇళ్ళల్లో ఉప్మా ఓ వరప్రసాదిని. బంధువులకి బ్రేక్‌ఫాస్ట్‌గా ఉప్మా చేయడానికి కారణం, దాన్ని వండటానికి సమయం వెచ్చించక్కర్లేదు. ఇడ్లీ, దోశ, పూరి, ఊతప్పంలాంటివి పొయ్యి ముందు నిలబడి తయారుచేసి ఇస్తూండాలి. ఉప్మా వండడానికి ప్రిపరేషన్‌తో సహా అరగంట చాలు. ఉప్మా అంటే 1980లదాకా బొంబాయి రవ్వ ఉప్మానే. బన్సీ రవ్వ పేరు మాయమై దానికి ఉప్మా రవ్వనే పేరు వచ్చేసింది. సంకరం చెంది గోధుమ రవ్వ ఉప్మా, జొన్న ఉప్మా, రాగి ఉప్మా, ఓట్స్ ఉప్మా, కొర్రల ఉప్మా, నూకల ఉప్మా, సగ్గుబియ్యం ఉప్మా, అటుకుల ఉప్మా (మహారాష్ట్రలో పోహో) మరమరాల ఉప్మా, నూడుల్స్ ఉప్మా ఇలా చాలా కనిపెట్టారు.

ఉప్పు పిండి ఉప్మాకి కజిన్. బియ్యం రవ్వతో చేసుకునే దీన్ని రాత్రుళ్ళు గంగాభాగీరథీ సమానులైన వారు తినేవారు. నేనోసారి తిన్నాక దాన్ని ఎంత రుచికరంగా చేయచ్చో అర్థమైంది. కొత్త కోడలు చేసే ఉప్మా రెండు రకాలు. ఒకటి తినే ఉప్మా. రెండోది తాగే ఉప్మా. రెండోది చేసిందా, తల్లి ఆమెకి వంట నేర్పించిందా, లేదా అని తెలుసుకోవచ్చు. కొందరికి సూపీ సూపీ ఉప్మా ఇష్టం.

హైద్రాబాద్‌లో నారాయణగూడ తాజ్‌మహల్ హోటల్ ఉప్మాకి ప్రసిద్ధి. వేటూరి సుందర్రామ్మూర్తిగారు అక్కడ రెగ్యులర్ కస్టమర్. హైద్రాబాద్‌లోని ఐకియా ఫర్నిచర్ స్టోర్‌లో బ్రేక్‌ఫాస్ట్‌కి పది రూపాయలకే ఉప్మాని సర్వ్ చేస్తారు. అది నేను తిన్న అత్యంత రుచికరమైన ఉప్మాలలో మొదటిది. నా కాలేజీ రోజుల్లో సాయంత్రం ఎన్.సి.సి డ్రిల్ అయ్యాక ఉపాహారంగా ఉప్మా పెట్టేవారు. ఆకలి మీద ఉండటం వల్లేమో అది గొప్ప రుచిగా ఉండేది. ఉప్మాలోని విశేషం, తిన్నాక నెమ్మదిగా జీర్ణమవుతుంది. కాబట్టి త్వరగా ఆకలి చేయదు. రోజంతా ఏక్టివ్‌గా ఉంచుతుంది. చక్కెర స్థాయిని నియంత్రిస్తుంది. ప్రయాణాల్లో దీన్ని వెంట తీసుకెళ్ళచ్చు. చల్లారినా రుచి పెద్దగా మారదు. ప్లాస్టిక్ స్పూన్‌తో తిని, తిన్నాక ప్లాస్టిక్ పెట్టెని పారేయచ్చు.

కెల్లాగ్స్ వాళ్ళు మనకి సిరియల్స్‌ని బ్రేక్‌ఫాస్ట్‌గా నేర్పిద్దామని వచ్చారు. ఇండియన్స్‌ని మార్చలేమని గుర్తించాక 2015లో ఉప్మా ప్రీమిక్స్ పాకెట్‌ని పది రూపాయలకి ఒకటి చొప్పున తెచ్చారు. దాన్ని వేణ్ణీళ్ళల్లో కలుపుకుని తినడమే. మహా రుచిగా ఉండేది. ఎందుకో ఆ ఉత్పత్తి ఆగిపోయింది. నేడు అడుకులే, ఎం.టి.ఆర్, సంకల్ప్, ప్రియ మరికొన్ని ఇన్‌స్టాంట్ ఉప్మాలు ఉన్నా, కెల్లాగ్స్ ఉప్మా రుచి వాటికి లేదు. ఆశీర్వాద్ ఇంట్‌స్టాంట్ ఉప్మాలో నార్త్ ఇండియన్ మసాలా వేయడంతో అది మసాలాబాత్ తప్ప ఉప్మాకాదు. ఉప్మా అన్ని సౌత్ ఇండియన్ రాష్ట్రాల్లో, మహారాష్ట్ర, ఒరిస్సాలలో మాత్రమే లభ్యం. నార్త్ ఇండియాలో ఉప్మా లేదు.

దేవదాసంటే నాకు సానుభూతి లేదు. ప్రేమలో విఫలమయ్యాక ఆయనగారు స్కాచ్ తాగుతూ, పాటలు పాడుతూ హాయిగా ఉంటే, ప్రేమ సఫలమైన నేను ఉప్మాలోకి ఉల్లిపాయలని తరుగుతూ.. చ్చ! ఏం బాలేదిది. ఎం.ఎల్.ఏగారు తన

అతిథికి ఉట్టి పెసరట్ పెట్టించి, తన పెసరట్‌లో బయటకి కనపడకుండా ఉప్మా పెట్టించుకునేవాడు. దాంతో దానికి 'ఎం.ఎల్.ఏ పెసరట్' అనే పేరు వచ్చిందని ప్రతీ తెలుగువాడికీ (తెలీని వారికి ఇప్పుడు) తెలుసు.

ఉప్మాతో నువ్వా, నేనా అనే పోటీలో పాల్గొనగలిగేది బహుశ ఒక్క పొంగలేనేమో! జంతువులకి ఉప్మా ఇష్టమా? అడవి రాముడు సినిమాలో పులి ఉప్మా తిని వెళ్ళాక రాజ్‌బాబు డైలాగ్ 'పులి ఉప్మా తిన్నదేమిటి చెప్మా?' డైలాగ్ గుర్తుందా? గుండమ్మ కథ సినిమాలో హర్నాథ్‌కి ఎల్.విజయలక్ష్మితో ఉన్న డైలాగ్ పద పద్మా 'నేను పద ఉప్మాకి ' అంటాను. చంటబ్బాయి నవల్లో హీరో ఉప్మా ప్రియుడు. చంటబ్బాయిలో ఉప్మా లేదు కాని తర్వాత చాలా ఉప్మా సినిమాలు వచ్చాయి. పోకిరీ, నువ్వే నువ్వే, ఘరానామొగుడు, మన్మధుడు, నిన్నుకోరి, రేసు గుర్రం, స్నేహం కోసం మొదలైన సినిమాల్లోని హీరోలకి ఉప్మా ఇష్టం. తిరుమలకి కాలినడకన వెళ్ళేప్పుడు దారిలో పాదచారులకి ఉప్మా ఇచ్చే పుణ్యమూర్తులని చూసాను. అది మొక్కు తీరి పంచారని చెప్పారు. ఎంత మంచి మొక్కోకదా?

మీరేమంటారు? మీ పొడవు మీ నాన్నగారి నించి, మీ బరువు మీ అమ్మగారి నించి మీకు వారసత్వంగా వస్తుంది.

2

ఆడవాళ్ళ హస్తభూషణం

ఆడవాళ్ళు ఇంట్లోంచి బయటకి వెళ్ళేప్పుడల్లా తప్పనిసరిగా వెంట తీసుకెళ్ళేది మొబైల్ కాదు. ఇంకోటి. ఆలోచించండి. బయటకి వెళ్ళినప్పుడల్లా అది దాదాపు వారి బహిఃప్రాణం. ఒకటి చాలని తెలిసినా ఆడవాళ్ళు ఇంకా ఎక్కువగా కొనేది ఏది? హేండ్‌బేగ్. అందులో సాధారణంగా ఉండేవి, ఇంటి తాలం చెవులు, క్రెడిట్ కార్డ్స్, కాయిన్ పర్స్, డబ్బు, దువ్వెన, చిన్న అద్దం, బొట్టు, టిష్యూ పేపర్స్, లిప్‌బాం, లిప్‌స్టిక్, మొబైల్, ఛార్జర్ మొదలైనవి. అందులోని వస్తువులకన్నా కొందరి బేగ్ ఖరీదే ఎక్కువ. ఆడవారి స్థాయి పెరిగే కొద్దీ వారు కొనే హేండ్‌బేగ్ ధర కూడా పెరుగుతూంటుంది. అన్నట్లు అమెరికాలో హేండ్‌బేగ్‌ని పర్స్ అంటారు.

మగాళ్ళు షర్ట్ వేసుకోకుండా వెళ్తే ఎలా నగ్నంగా ఫీలవుతారో, ఆడవాళ్ళు హేండ్‌బేగ్ లేకుండా బయటకి వెళ్తే అలా ఫీలవుతారు. 1970లు, 80లలోని ఉద్యోగినులకి హేండ్‌బేగ్ తప్పనిసరిగా ఉండేది. దాంట్లో లంచ్ బాక్స్ కూడా. ఇంకా కేరీబేగ్‌లు రాని ఆ కాలంలో సాయంత్రం ఇంటికి వస్తూ కూరలు, పళ్ళుకొని అందులో వేసి తెచ్చేంత పెద్దవి కొనేవారు. హేండ్‌బేగ్ మరో ఉపయోగం వర్షం పడుతూంటే పైన గొడుగులా అడ్డుపెట్టుకోవడం. భర్తని కొట్టడానికి కూడా అది ఉపయోగిస్తుందని గమనించాను. మాటలకన్నా హేండ్‌బేగ్ ఓ మహిళ గురించి చక్కగా చెప్తుంది. చాలామంది విజయవంతమైన ఆడవాళ్ళ చేతిలో ఓ హేండ్‌బేగ్ ఉంటుంది. ఓ మహిళ వ్యక్తిత్వాన్ని ఆమె హేండ్‌బేగ్తే చాటుతుంది. బయటకి వెళ్ళే ఆడవాళ్ళకి హేండ్‌బేగ్ పెద్ద సమస్యని తెచ్చి పెడుతూంటుంది. ఏ హేండ్‌బేగ్ తీసుకెళ్ళాలి? పెద్దది తీసుకెళ్ళాలా? చిన్నదా? అదా? ఇదా? చాలా 'ఇది'లు ఉంటాయి.

ఈ రోజుల్లో ఆడవాళ్ళ దగ్గర సగటున పదికన్నా ఎక్కువ హేండ్‌బేగ్స్ ఉంటున్నాయి.

హేండ్‌బేగ్ రంగు, దుస్తుల రంగు మేచ్ అవాలి. మా మరదలు తనకున్న హేండ్‌బేగ్ రంగుని బట్టి దుస్తులని ఎన్నుకుంటుంది. హేండ్‌బేగ్‌కి వచ్చేసరికి పోస్టాఫీస్‌లో క్లర్కైనా, దేశాధినేతైనా ఆడవాళ్ళంతా ఒకటే. జయలలిత మరణానంతరం ఆవిడ ఇంట్లో 300కి పైగా హేండ్‌బేగ్స్‌ని కనుగొన్నారు. వాటిలో పాపులర్ బ్రాండ్స్ కోచ్, ప్రాడా, బర్బరీ, వేలంటీనో, ఫెండీ, లూయీ విటాన్, గూచీ.. ఇంకా ఎన్నో ఉన్నాయి. ఫిలిఫీన్స్ ప్రెసిడెంట్ భార్య ఇమెలాడా మార్కోస్ ఇంట్లో కూడా వందలకొద్దీ విలువైన హేండ్‌బేగ్స్‌ని కనుగొన్నారు. జయలలితలా ఆమె కూడా జైలుకి వెళ్ళింది. 2024లో సౌత్ కొరియా రాజకీయాల్లో ఓ హేండ్ బేగ్ సంచలనమైంది. ఆనాటి ప్రెసిడెంట్ భార్య కిం కియాన్ హీ 2,250 డాలర్ల విలువైన క్రిస్టియన్ డియోర్ హేండ్‌బేగ్‌ని ఓ అమెరికన్ పాస్టర్ నించి బహుమతిగా స్వీకరించింది. అది లంచంగా పరిగణించబడటంతో ఆమె ప్రాసిక్యూషన్‌ని ఎదుర్కొంది.

బ్రిటీష్ రాణి ఎలిజబెత్ – 2 లానర్ లండన్ మేక్ హేండ్‌బేగ్ లేకుండా ఎన్నడూ కనపడదు. ఆవిడ దాన్ని కుడి చేతిలోంచి ఎడం చేతిలోకి మారిస్తే సందర్సకులని పంపేయాలని, కిందపెడితే తను బయలుదేరడానికి సిద్ధంగా ఉందని సర్వెంట్స్‌కి రహస్యంగా సూచించేది. అందులో ఉండేది చర్చ్‌లో డొనేషన్ ఇవ్వడానికి ఐదు పౌన్ నోట్ మాత్రమే.

హేండ్‌బేగ్స్ చాలా రంగుల్లో వస్తాయి. ఆరెంజ్, పసుపుపచ్చ, బచ్చలి గింజల రంగు, ఆకుపచ్చ, నీలం, నలుపు–తెలుపు. కొన్ని హేండ్‌బేగ్స్ నేడు చాలా వచ్చాయి. నీతూ అంబానీ హేండ్‌బేగ్ ఖరీదు రెండున్నర కోట్ల రూపాయలు. ఒకప్పుడు స్త్రీలు తోటి స్త్రీల ఆభరణాలని ఆసక్తిగా చూసేవారు .నేడు హేండ్‌బేగ్‌లని చూస్తున్నారు.

సంపద స్థాయి పెరిగే కొద్దీ హేండ్‌బేగ్ చిన్నది అవుతూంటుంది .హేండ్‌బేగ్‌ని బట్టి వారి ఆర్థికస్థితిని అంచనా వేయచ్చు. కార్లో వెళ్ళేవారి హేండ్‌బేగ్ చిన్నగా ఉంటుంది. కేవలం క్రెడిట్ కార్డ్, మొబైల్ అందులో పడితే చాలు. మిగిలినవన్నీ కార్లో వదులుతారు. అంటే హేండ్‌బేగ్ సైజుని బట్టి కూడా మహిళల వాహనం ఏదో తెలుసుకోవచ్చు స్కూటర్ మీద భర్త ఆఫీస్ దగ్గర దింపే భార్య హేండ్‌బేగ్ టిఫిన్ బాక్స్ పట్టేంత పెద్దదైతే ఆమె సాధారన మహిళ. సాయంత్రం ఆఫీస్ అయ్యాక ఆమె అందులో సరుకులు కొని తెస్తుంది.

హేండ్‌బేగ్‌లో కూడా చాలా జాతులు ఉన్నాయి. కేజువల్‌గా వెళ్ళేప్పుడు ఓ జాతిది, పార్టీలకి మరో జాతిది, పెళ్ళిళ్లకి ఇంకో జాతిది ఇలా సందర్భాన్ని బట్టి అనేక జాతుల హేండ్‌బేగ్స్ ఉంటాయి. అలాగే జీన్స్, టి.షర్ట్‌లకి ఓ రకం బేగ్, చీరకి మరో రకం. కొన్ని తగిలించుకునేవి. కొన్ని చేతిలో పట్టుకునేవి. కొన్ని రెక్సిన్‌తో చేస్తారు. ఇంకా లెదర్, సిల్క్, జీన్స్ బట్టతో, గడ్డితో, వెదురుతో చేస్తారు.

1950ల్లో బ్లాక్ అండ్ వైట్ తెలుగు సినిమాల్లో హీరోయిన్ చేతిలో మేకపిల్లతో, చెరుగ్గడ నములుతూ కనిపిస్తే ఆమె పల్లెటూరి పిల్లని, నల్ల కళ్ళజోడు పెట్టుకుని, చేతికి హేండ్‌బేగ్ తగిలించుకుంటే ఆమె బస్తీ పిల్లని గుర్తు. గుండమ్మ కథ

సినిమాలో హేండ్‌బేగ్ గొప్ప పాత్రని పోషించింది. జమున హేండ్‌బేగ్‌లోంచి నాగేశ్వరరావు డబ్బు కొట్టేసి, ఆమెకి అప్పిచ్చి ఆదుకుని పరిచయం చేసుకుంటాడు.

చెడ్డ భర్త ఎవరు? తన హేండ్‌బేగ్‌ని రహస్యంగా వెదికే వెధవ. మంచి భర్త ఎవరు? భార్యకి తెలియకుండా ఆమె అవసరానికి తగ్గ డబ్బుని ఆమె హేండ్‌బేగ్‌లో ఉంచే భర్త. ఎహె! మంచి భర్త ఎవరంటూంటే? సారీ. ఆమె అవసరానికి మించిన డబ్బుని ఉంచేవాడే మంచి భర్త.

హేండ్‌బేగ్స్‌లోని ఓ సమస్య ఎన్ని హేండ్‌బేగ్స్ ఉన్నా ఓసారి ఒక్కటే తీసుకెళ్ళాలి. ఎన్ని ఉన్నా తనకి సరిపడే హేండ్‌బేగ్స్ ఉన్నాయని ప్రపంచంలో ఏ స్త్రీ అనలేదని పందెం.

మీరేమంటారు? ఖాళీ పొట్టకన్నా ఖాళీ మెదడు ప్రమాదం.

Post your comments

ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి

www.anandbooks.com
www.telugubooks.in